యాభై వజ్రాలు

టెంపోరావ్

మిస్ సురేఖ స్నానంచేసి పడగ్గదిలోకి వచ్చింది. బీరువా అద్దం ముందు నిలబడి తన పొడుగాటి తల వెంట్రుకలను తువ్వాల్తో తుడుచుకుంటోంది.

సమీపంలో వున్న సోఫాలో కూర్చుని అశ్వద్ధామ దినపత్రికను చూస్తున్నాడు. సిగరెట్ పొగ వదుల్తూ అతడు దినపత్రికను పక్కనున్న టీపాయిమీద పడేసి బరువుగా వూపిరి పీల్చాడు.

"డిటెక్టివ్‌లు ఎంతో కష్టపడి అపరాధులను పట్టుకుంటారు. కాని వాళ్ళు సునాయాసంగా జైళ్ళలోంచి పారిపోతారు!" అన్నాడు అశ్వద్ధామ సురేఖవైపు చూస్తూ.

వెనుదిరిగి ఆమె అతడివంక చూసింది.

"ఏం జరిగింది?" అడిగిందామె.

అశ్వద్ధామ వెంటనే జవాబివ్వలేదు. ఓ నిమిషంపాటు ఆమెకేసి చూస్తూండిపోయాడు. అప్పుడే స్నానం చేసిన

ఆమె శరీరం జంగారంలా మెరుస్తోంది. ఆమె విశాల నేత్రాలు..ఆజంతా బొమ్మలను జ్ఞప్తికి తెచ్చే ముక్కు... ఎర్రటి పెదిమలు — యివన్నీ చూస్తూంటే ఏ దేవతో తనతో కలిసి జీవించడానికి సురేఖలా రూపొంది వుంటుందని ఆతడు లోలోపల అనుకున్నాడు.

"ఏమిటలా చూస్తున్నారు? ఏం జరిగిందో చెప్పండి!" సురేఖ మళ్ళీ అడిగింది.

"ఈ పేపరు చూస్తే నీకే తెలుస్తుంది" అన్నాడతను.

టీపాయి మీదున్న దినపత్రికను తీసి ఆమె చదవసాగింది. అంతా చదివి ఆమె అశ్వద్ధామ వైపు చూసింది.

"గజదొంగ రామ్మూర్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడన్నమాట! రాజమండ్రీ జైలునుంచి ఆతడు ఎలా పారిపోయాడో!" అందామె.

"రాతిగోడల మధ్య వుంచినా కొంతమంది అలా పారిపోతూనే వుంటారు. నాలుగేళ్ళ క్రితం డిటెక్టివ్ వాలిగారు ఆ గజదొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాని ఏం లాభం?"

"రామ్మూర్తి మద్రాసులో ఎక్కడో దాక్కుని వుండవచ్చని పోలీసులు అంటున్నారు. ఈ వార్త చదివి మద్రాసు ప్రజలు భయపడ్తూ వుంటారు" అందామె.

అశ్వద్ధామ సోఫాలోంచి లేచి ఆమె దగ్గరగా వెళ్ళాడు. వుషారుగా ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు. మరుగుజ్జు మంజూ లోపలకొచ్చి ఆగింది.

"ఏం మంజూ?" అడిగాడతను.

"మీ కోసం యిద్దరు స్త్రీలు వచ్చారు. వాళ్ళను క్రిందనున్న డ్రాయింగ్ రూంలో కూర్చోబెనున్నాను" అందామె.

"ఎవరు వాళ్ళు?" అడిగాడతను.

"తల్లీ కూతురూ అయివుండవచ్చు సార్. పోలిక లున్నాయి."

"గుడ్, నువ్వెళ్ళు. కాస్సేపట్లో వస్తాను."

మంజూ వెళ్ళిపోయింది. అశ్వద్ధామ సూటు ధరించి మేడ మెట్లు దిగి డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు. సోఫాలో కూర్చున్న ఆడవాళ్ళిద్దరూ లేచి అతడికి నమస్కరించారు.

"కూర్చోండి!" అని అతడు సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

"చెప్పండి!"

"నానాలాల్ గారి భార్యను నేను. పేరు సుమిత్ర. ఈమె మా అమ్మాయి. నిన్నరాత్రి ఎనిమిదింటికి షాపుకు తాళంవేసి మావారు యింటికి వస్తున్నారు. మింట్ స్ట్రీట్ సమీపంలో ఆయన్ని యెవరో హత్యచేశారు. ఈ కేసును మీకు అప్పగించాలని ఇలా వచ్చాను" అందామె ఏడుస్తూ.

"షాపునుంచి ఇంటికి వచ్చేసమయంలో ఆయనవద్ద విలువైన వస్తువులు ఏమైనా వున్నాయా?"

తల్లీ, కూతురూ కొంతసేపు ఏడుస్తూ వుండిపోయారు.

"ఆయన వద్ద ఐదులక్షలు విలువజేసే వజ్రాలున్నాయి. వాటిని పెట్టెలో జాగ్రత్తగా వుంచి, పెట్టెను జేబులో దాచుకుని ఆయన ఇంటికి బయల్దేరారు. హత్యానంతరం పోలీసులు ఆయన జేబులు వెతికారు. తాళంచెవులు, చిల్లర డబ్బు, కొన్ని కాగితాలు మాత్రం దొరికాయి. వజ్రాల పెట్టె లేదు."

"ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు?"

"షాపునుంచి ఇంటికి బయల్దేరేముందు ఆయన రోజూ నాకు ఫోన్ చేసేవారు. నిన్న రాత్రి కూడా అలాగే చేశారు."

"అంత ఖరీదైన వజ్రాలను ఆయన కొని యెంత కాలమైంది?"

"నిన్న మధ్యాహ్నమే ఆయన కొన్నారు. బలిపింటే యీ పాటికి అమ్మేసి వుండేవారు" అందామె.

"ఎవరికి?"

"బొంబాయినుండి కోటీశ్వరులైన మోతిలాల్ సేట్ మద్రాసు వచ్చారు. ఆయన కన్నెమేరా హోటల్లో వుంటున్నారు. వజ్రాలు కొనడానికి ఆయన యీ వూరు వచ్చినట్లు మావారు తెల్సుకున్నారు. నిన్న పొద్దుట మావారు మోతీలాల్ సేట్ని కల్సుకున్నారు. ఆయన ఒక వజ్రాన్ని చూపించారు. ఆయనకది బాగా నచ్చింది. అటువంటివి యాభై వజ్రాలు కావాలని ఆయన ఆర్డరిచ్చారు. రాత్రి తొమ్మిదిన్నరకి యాభై వజ్రాలు తనకు యిచ్చి డబ్బు పట్టుకెళ్ళమన్నారు. ఈ వ్యాపారం జరిగుంటే మావారికి కొన్ని లక్షలు లాభం వచ్చేది. కాని అంతా తుడుచుకుపోయింది" అందామె బాధతో.

"ఆ వజ్రాలను ఆయన ఎక్కడ కొన్నారు?"

"చైనాబజారులోని రామ్‌రామ్ సేట్ కంపెనీలో కొన్నారు."

అశ్వద్ధామ ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఫోన్ చేసినప్పుడు మీ ఆయన మరింకా ఏం చెప్పారో పూర్తిగా తెలపండి."

"మోతీలాల్ సేట్‌కి కావలసిన యాభై వజ్రాలు కొన్నాననీ, ఇంటికొచ్చి భోజనంచేసి, తొమ్మిదిన్నరకి

అవి తీసుకెళ్ళి ఆయనకిచ్చి డబ్బు తీసుకోవాలనీ ఆయన చెప్పారు."

"యింకా ఏమైనా చెప్పారేమో జ్ఞాపకం తెచ్చుకోండి" అన్నాడతను.

"షాపునుంచి ఆయన మోతీలాల్ సేట్‌కి ఫోన్ చేసి వజ్రాలు సిద్ధంగా వున్నాయని చెప్పారు. ఆయన సంతోషిస్తూ 9-30కి వచ్చి డబ్బు తీసుకెళ్ళమన్నారట."

"మీ షాపులో యెంతమంది పనిచేస్తున్నారు?"

"మా షాపులో యెక్కువమంది లేరు సార్. ఒక గుమస్తా, ఒక నౌఖరు మాత్రం వున్నారు. అన్ని పనులూ మావారే చూసుకుంటారు."

"ఈ వజ్రాలు కొన్న విషయం వాళ్ళకు తెలుసా?"

"మావారు చెప్పరు. ఇటువంటి వాటిలో ఆయన జాగ్రత్తగా వుంటారు" అందామె.

ఆలోచిస్తూ అశ్వద్ధామ స్టేట్ ఎక్స్‌ప్రెస్ 555 సిగరెట్ వెలిగించాడు. గులాబీ రంగు షిఫాన్ చీర ధరించి, మెట్లు దిగి సురేఖ గదిలోకొచ్చి అతడి పక్కనే సోఫాలో కూర్చుంది. అతడు చిరునవ్వుతో పక్క కూర్చున్న సురేఖ వంక చూశాడు. మెల్లిగా అతడి చూపు సుమిత్రవైపు వెళ్ళింది.

"మీకీ హత్య విషయం రాత్రి ఎలా తెలిసింది?" అడిగాడతను.

"రాత్రి తొమ్మిది దాటాక పోలీసులు యింటికొచ్చి, యీ విషయం చెప్పి, నన్నూ అమ్మాయినీ జీప్‌లో యెక్కించి హత్యాస్థలానికి తీసుకువెళ్ళారు. రోడ్డువారగా పడున్న ఆయన శవాన్ని చూసి యిద్దరం ఏడుస్తూ వుండిపోయాం. తర్వాత పోలీసులకు నాకు

తెలిసింది చెప్పాను."

అశ్వద్ధామ సోఫాలోంచి లేచి ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. రిసీవర్ యెత్తి ఒక నంబరు తిప్పాడు.

"హలో, ఇన్స్పెక్టర్ ప్రతాప్!" అంది అటువైపు కంఠం.

"అశ్వద్ధామ హియర్! నానాలాల్ శవం యెక్కడుంది?"

"గవర్నమెంట్ హాస్పిటల్లో, అక్కడికి వస్తున్నారా?"

"వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేశాడు.

మిస్ సురేఖ అతడి పక్కనే వుంది.

"రేఖా, గజదొంగ రామ్మూర్తికి ఈ హత్యతో సంబంధం వుండొచ్చు. నేను శవాన్ని చూసి వస్తాను. నువ్వు కన్నెమేరా హోటలుకి వెళ్ళి మోతీలాల్ సేట్ గురించి వివరాలు కనుక్కో!" అన్నాడతను.

2

కాడిలాక్ కారును హాస్పిటల్ కాంపౌండులో ఆపి అశ్వద్ధామ దిగాడు. మార్ట్యురీవైపు నడిచాడు. అతడు హాల్లో ప్రవేశించగానే ఇన్స్పెక్టర్ ప్రతాప్ ఎదురుగా కనిపించాడు.

"నమస్తే అశ్వద్ధామగారూ, మీరు వస్తున్నారనే యిలా వచ్చాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

"నిన్న రాత్రి హత్యచేయబడిన నానాలాల్ శవం చూద్దామని యిలా వచ్చాను" అన్నాడు అశ్వద్ధామ.

ఇన్స్పెక్టర్ వెటకారంగా నవ్వాడు.

"అంత విలువైన వజ్రాలను జేబులో పెట్టుకుని రాత్రి సమయంలో తిరిగితే దొంగలు వూరుకుంటారా?"

"కొంతమందికి పోలీసాళ్ళమీద నమ్మకం ఎక్కువ!" అన్నాడు అశ్వద్ధామ వ్యంగ్యంగా.

ఇన్స్పెక్టర్ తల వంచుకున్నాడు.

"ప్రతాప్, గజదొంగ రామ్మూర్తి మద్రాసులో వుండొచ్చని వార్త వచ్చింది. ఇటువంటి సమయంలో పట్నం నలువైపులా పోలీసులు గస్తీ తిరుగుతూ వుండాలి" అన్నాడు అశ్వద్ధామ.

ఇద్దరూ పొడుగాటి బల్లవైపు నడిచారు. శవం పైనున్న గుడ్డను యిన్స్పెక్టర్ తీసేశాడు. అశ్వద్ధామ పరీక్షగా శవంవంక చూశాడు.

నానాలాల్ వయసు యాభై దాటి వుంటుంది. కత్తితో యెవరో అతడి గుండెల్లోకి పొడిచి వుండాలని అశ్వద్ధామ గ్రహించాడు. కొన్ని నిమిషాల్లో అతడు మరణించి వుండాలి.

ఇన్స్పెక్టర్ ప్రతాప్ గుడ్డతో మళ్ళీ శవాన్ని కప్పేశాడు. ఇద్దరూ గుమ్మంవైపు కదిలారు.

"ప్రతాప్, కన్నెమేరా హోటల్లో వుంటున్న మోతీలాల్ సేట్ గురించి ఏమైనా కనుక్కున్నారా?" ప్రశ్నించాడు అశ్వద్ధామ.

"నిన్న రాత్రి అదంతా దర్యాప్తుచేశాం. రాత్రి తొమ్మిదిన్నర లోపల మోతీలాల్ సేట్ హోటలు వదిలి విమానాశ్రయానికి వెళ్ళాడని తెలిసింది" అన్నాడు ఇన్స్పెక్టర్ ప్రతాప్.

"అతనెక్కడికి వెళ్ళాడో కనుక్కున్నారా?"

"అతను బొంబాయి వెళ్ళుంటాడు. మోతీలాల్ సేట్ గురించి ఈ పట్నంలో అనేకమంది డైమండ్ వ్యాపారాలుకు తెలుసు. అతడు కోటీశ్వరుడని అందరూ

యెరుగుదురు. అతడికి యీ హత్యతో సంబంధం వుండి వుండదు."

అశ్వద్ధామ మౌనంగా తన కారువైపు నడిచాడు. సీటుమీద కూర్చుని తలుపు మూశాడు. ఇన్స్పెక్టర్ ప్రతాప్ ముందుకు వెళ్ళి అశ్వద్ధామవైపు చూశాడు.

"ఈ హత్యతో గజదొంగ రామ్మూర్తికి ఏదేనా సంబంధం వుందంటారా?" అడిగాడతను.

అశ్వద్ధామ సిగరెట్ వెలిగించాడు. పొగ వదులుతూ ప్రతాప్ వంక చూశాడు.

"యెక్కడేనా నేరం జరిగితే అసలు నేరస్థుడిని కనుక్కోలేదాకా అవకాశమున్నవాళ్ళను మనం అనుమానించాలి" అన్నాడు అతను.

"అయితే రామ్మూర్తికోసం యీ పట్నమంతా గాలిస్తాను" అన్నాడు ప్రతాప్.

"దాంతో తృప్తిపడకండి. రామ్మూర్తికి ఈ హత్యతో సంబంధం వుంటే యీ పాటికి అతను యెక్కడికో పారిపోయుంటాడు. అతడి కోసం అనేక పట్నాల్లో మీరు వెతకాలి. జైల్లోంచి అంత సులువుగా పారిపోగల్గిన రామ్మూర్తి మీకంత తేలిగ్గా దొరకడు!" అని అశ్వద్ధామ కారును ముందుకు పోనిచ్చాడు.

రామ్‌రామ్ సేట్ కంపెనీవైపు కాడిలాక్ కారు దూసుకుపోయింది.

3

డిసోటో కారును కన్నెమేరా హోటల్ ముందు ఆపి, మిస్ సురేఖ దిగి, వయ్యారంగా హోల్లోకి నడిచింది. అటువైపునున్న యువకుడు ఆమెను చూసి పెదిమలు చప్పరించుకున్నాడు.

"మోతీలాల్ సేట్ గారు వున్నారా, వెళ్ళి పోయారా?" అడిగిందామె.

"నిన్న రాత్రి 9-30కి ఆయన వెళ్ళిపోయారు."

"ఇల్లక్!" అందామె.

హోటల్ గుమస్తా ఆమెవైపు మౌనంగా చూశాడు.

"ఈసారి కూడా ఆయన్ని కల్సుకోలేక పోయాను!" అందామె.

"ఇంతకుముందు ఆయన కోసం మీరు యిక్కడకు వచ్చారా?" అడిగాడతను.

"మీరెందుకు ప్రశ్నిస్తున్నారు?"

"ఆయన యీ హోటల్లో దిగడం యిదే మొదటి సారి. మద్రాస్ ఎప్పుడొచ్చినా ఆయన దాశప్రకాష్ హోటల్లో దిగేవారు. మా పబ్లిక్ రిలేషన్స్ వాళ్ళు రాసిన ఉత్తరాల మూలంగా ఆయన యీసారి ఇక్కడ దిగారు."

"ఇంతకుముందు దాశప్రకాష్ హోటల్ కే ఆయన కోసం నేను వెళ్ళాను. అప్పుడు కూడా ఆయన్ని చూడ లేకపోయాను. పాపం, ఆయన ఆరోగ్యం ఎలా వుందో?"

"ఆయన ఆరోగ్యం బాగాలేదు. ఇక్కడున్న నాలుగు రోజులూ ఆయన గదిలోంచి బయటకు రాలేదు. ఆయనతో వుండే నౌఖరు అన్నీ లోపలకు పట్టుకెళ్ళి ఇచ్చేవాడు."

సురేఖ శాస్త్రేపు ఆలోచిస్తూ వుండిపోయింది.

"నిన్న రాత్రి ఆయన వెళ్ళటం మీరు చూశారా?"

"చూడలేదండి. తొమ్మిది దాటాక నౌఖరు వచ్చి, ఆయన గది ఖాళీచేస్తున్నారని చెప్పి, బిల్లు చెల్లించాడు. అటుపైన ఆయన వెళ్ళిపోయారు."

ఆమె నవ్వుతూ గుమస్తా వైపు చూసింది.

"మోతీలాల్ సేట్ గారి బొంబాయి టెలిఫోన్ నంబరు మీకు తెలుసా?"

అతడు అడుగుతున్న ఒక డైరెక్టరీతీసి కౌంటరుమీద పెట్టాడు.

"ఇది బొంబాయి టెలిఫోన్ డైరెక్టరీ. పేజీలు తిప్పిచూడండి!"

పేజీలు తిప్పి మోతీలాల్ సేట్ పర్సనల్ నంబర్ని ఆమె డైరీలో రాసుకుంది.

గుమస్తాకు థాంక్స్ చెప్పి ఆమె బయటకు నడిచింది. కారును యింటివైపు వేగంగా పోనిచ్చింది. హాల్లో అడుగుపెట్టింది. అశ్వద్ధామ ఇంట్లో లేడు. మిస్ సురేఖ ఫోన్ దగ్గరకు నడిచింది. రిసీవర్ యెత్తి బొంబాయికి STD కాల్ చేసింది.

"మోతీలాల్ సేట్ హియర్!" అందో కంఠం అటు వైపునుంచి.

"నమస్తే సార్. నేను రామానుజం చెట్టియార్ సెక్రటరీని" అందామె.

"ఆయన ఎవరు?"

"ఆయన పేరు పొందిన డైమండ్ మర్చంట్."

"ఏం కావాలి?"

"ఆయన దగ్గర విలువైన శ్రీలంకా డైమండ్స్ వున్నాయి. ఒకసారి వాటిని మీకు చూపించాలని ఆయన కోరిక."

"నెలపైగా జర్మనీలో వుండి నిన్న సాయంత్రం నేను బొంబాయికి తిరిగొచ్చాను. ప్రస్తుతం ఐయామ్ వెరీ బిజీ.

వచ్చే నెల మొదటివారంలో నేను మద్రాసు రావచ్చు."

"థాంక్స్, ఇక్కడికొస్తే దాశప్రకాష్ హోటల్లో నే బసచేస్తారు గా?"

"మద్రాస్ యెప్పుడొచ్చినా అక్కడే వుంటాను."

"థాంక్స్. అంతా రామానుజం చెట్టియార్ గారికి చెప్తాను" అని ఆమె రిసీవర్ పెట్టేసింది.

అంతా విచిత్రంగా వుంది. ఆలోచిస్తూ ఆమె సోఫాలో కూర్చుంది.

4

కిందనున్న డైనింగ్ గదిలో అశ్వద్ధామ, మిస్ సురేఖ కుర్చీల్లో కూర్చుని భోజనం చేస్తున్నారు. మరుగుజ్జు మంజూ సమీపంలో నిలబడి వాళ్ళకు కావలసిన పదార్థాలను వడ్డిస్తోంది.

తను కనుక్కున్నదంతా సురేఖ అతడికి చెప్పింది.

"రేఖా, నువ్వు చెప్పినదాన్నిబట్టి ఒక విషయం మనం వూహించవచ్చు. మోతీలాల్ సేట్, నాఖుదా ఒకరే అయివుండాలి!"

"యూ ఆల్ రైట్!"

"మరో విషయం. మోతీలాల్ సేట్ జర్మనీలో వుండి, నిన్నే బొంబాయి వచ్చాడు. యెవరో వ్యక్తి అతడి పేరుతో కొన్నిమేరా హోటల్లో చేరాడని తెలుస్తోంది. గదిలోనే అతడు వుండేవాడు. బయటకు రాలేదతను. నాఖుదా వేషంలో అతడు బయటకొచ్చేవాడు. హోటల్ బిల్లు నాఖుదా చెల్లించాడు. మోతీలాల్ వెళ్ళటం ఎవ్వరూ చూడలేదు!"

"బాగుంది, చెప్పండి!" అందామె.

"మోతీలాల్ గా నటించినతను ఏ టాక్సీ లో నో

వెళ్ళుండొచ్చు. ఆ టాక్సీ డ్రయివర్ని మనం కనుక్కో-వాలి!"

బయట బూట్ల చప్పుడైంది. మంజూ వేగంగా బయటకెళ్ళి, తిరిగివచ్చింది.

"ఇన్స్పెక్టర్ ప్రతాప్ వచ్చారు. మీతో అర్జంటుగా మాట్లాడాలిట" అందామె.

"ఆయన్ని కూర్చోమని, హాట్ కాఫీ యియ్యి. కాస్సేపట్లో వస్తాను" అన్నాడు అశ్వద్ధామ.

మంజూ బయటకు వెళ్ళింది. తిరిగొచ్చి కాఫీ కప్పులో పోసి పట్టుకెళ్ళి ఇన్స్పెక్టర్కు అందించింది.

కొంతసేపయ్యాక గదిలోకొచ్చిన అశ్వద్ధామ, సురేఖలను చూసి యిన్స్పెక్టర్ ప్రతాప్ లేచాడు. ఏదో గొప్ప విజయాన్ని సాధించినట్లు ప్రతాప్ కళ్ళు మెరుస్తున్నాయి.

అందరూ సోఫాలో కూర్చున్నారు.

"అశ్వద్ధామగారూ, మీరు వెళ్ళిపోయాక ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. నిన్న రాత్రి మోతీలాల్ సేట్ యెక్కిన టాక్సీ డ్రయివర్ని కల్సుకున్నాను. అతడు ఆ టాక్సీలో తిన్నగా విమానాశ్రయానికి వెళ్ళాడు. దిగిపోతూ టాక్సీవాడిని వుండమన్నాడు. తన నౌఖర్ని సెంట్రల్ స్టేషన్లో వదిలివెళ్ళమని డ్రయివర్తో చెప్పాడు. మోతీలాల్ చిన్న బాగ్ పట్టుకుని వెళ్ళి పోయాడు. పది నిమిషాల్లో ఒక బాగ్ పట్టుకుని నౌఖరు వచ్చాడు. మోతీలాల్ సేట్ వచ్చిన టాక్సీ అదేనా అని డ్రయివర్ని అడిగాడు. డ్రయివర్ అవునని చెప్పగానే అతడు టాక్సీ యెక్కాడు. అతడిని సెంట్రల్ స్టేషన్లో విడిచిపెట్టి టాక్సీ డ్రయివర్ వెళ్ళిపోయాడు" అన్నాడు

ప్రతాప్.

"నాఖరుతో ఏదేనా సామానుందా?" అడిగాడు అశ్వద్ధామ.

"కారులో వున్న ఒక పెట్టెను డ్రయివర్ నాఖరుకు అందించాడు."

"బాగుంది. యింకా ఏం కనుక్కున్నారు?"

"స్టేషన్‌లో పనిచేసే రైల్వే కూలీతో మాట్లాడి ఆ నాఖరు ఊటీ వెళ్ళాడని తెల్సుకున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్ ప్రతాప్.

"అదెలా తెలిసింది?" అశ్వద్ధామ అడిగాడు.

"సెంట్రల్ స్టేషన్‌లో టాక్సీ ఆగగానే ఒక కూలి అటు పరుగెత్తాడు, టాక్సీలోంచి దిగిన నాఖరుని చూడగానే అతడు నిరుత్సాహ పడ్డాడు. కానీ నాఖరు సామాను తీసుకోవాలని చెప్పాడు. కూలీ పెట్టెను తీసుకున్నాడు. నాఖరు టికెట్లమ్మే చోటుకు వెళ్ళాడు. సమీపంలో కూలీ నిలబడి వున్నాడు. అతడు ఊటీకి టికెట్ కొన్నాడు. పెట్టెను కంపార్టుమెంట్‌లో పెట్టి—కూలీ వేచి వున్నాడు. అతడు కూలీకి రెండు రూపాయలు యిచ్చాడు."

"ఆ నాఖరు యెలా వుంటాడో కనుక్కున్నారా?"

"అనేకమంది ద్వారా తెల్సుకున్నాను. పొడుగ్గా, బలంగా వుంటాడు. పంచ, చొక్కా ధరించాడు. తలపాగా వుంది. సన్నటి మీసాలు" అన్నాడు ప్రతాప్.

ఆలోచిస్తూ అశ్వద్ధామ గదిలో పచార్లు చేయసాగాడు. కొంతసేపయ్యాక యిన్స్పెక్టర్ ముందు అతడు ఆగాడు.

"ప్రతాప్ మీరు కనుక్కొన్న విషయాలు మనకు చాలా వుపయోగపడ్డాయి. మనం వెంటనే ఊటీ వెళ్లాలి. నానాలాల్ హంతకుడు మనకు దొరకొచ్చు" అన్నాడు అశ్వద్ధామ.

"అశ్వద్ధామగారూ, ఇది శీతాకాలం. ఊటీలోని కొన్ని హోటల్సు మాత్రం తెరిచివుంటాయి. హోటలు ఇంపీరియల్ కి చాలా పేరుంది. కూనూరులో వున్న సబిన్ స్పెక్టర్ మృత్యుంజయరావుతో ఫోన్లో మాట్లాడాను. వెంటనే ఊటీ వెళ్ళి అక్కడ దర్యాప్తు చెయ్యమని చెప్పాను. మృత్యుంజయరావు మారు వేషాలు వేయటంలో ఆరితేరినవాడు. హోటలు ఇంపీరియల్లో బట్లర్ గా చేరి అతడు వారంరోజులపాటు అక్కడుండి అంతా గమనించి నాకు చెప్తాడు" అన్నాడు ప్రతాప్.

"హోటలు మేనేజర్ కి తనెవరో చెప్పి అతడు బట్లర్ గా వుంటాడా?"

"అవుసరంలేదు సార్ శీతాకాలంలో అక్కడ నౌఖరు దొరకరు. అందువలన ఆ హోటల్లో బట్లర్ ఉద్యోగం అడగ్గానే ఎవరికేనా యిస్తారు."

క్షణకాలం గదిలో నిశ్శబ్దంగా వుంది.

"అన్ని లక్షలు విలువచేసే వజ్రాలను పట్టుకుని నౌఖరులా నటించేవాడు ఊటీ యెందుకు వెళ్ళుంటాడు?" అడిగాడు ప్రతాప్.

"అతడు ఊటీ వెళ్ళటంలో ఆశ్చర్యంలేదు. శీతాకాలంలో ఊటీకి ఎవ్వరూ వెళ్ళరు. అనేక పట్నాలలో పోలీసులు తన కోసం వెతుకుతుండగా, ఊటీలో దొంగ విశ్రాంతి తీసుకోవచ్చు. అక్కడినుంచి రెండు మూడు

నెలల తర్వాత మరెక్కడికైనా పారిపోవచ్చు"
అన్నాడు అశ్వద్ధామ.

"అశ్వద్ధామగారూ, మీరు చెప్పింది వింటూంటే ఊటీలో మనకు కావలసిన హంతకుడు వుండొచ్చు అని పిస్తోంది. మీరు కూడా వెంటనే ఊటీ వెళ్ళటం మంచి దనిపిస్తోంది. సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావు మీకు సహాయపడ్తాడు."

అశ్వద్ధామ నవ్వుతూ సురేఖవైపు చూశాడు.

"వింటర్లో ఊటీ నీకు నచ్చుతుందా?"

"వెళ్దాం పదండి!" అందామె నవ్వుతూ.

"అయితే రాత్రి ఎక్స్ప్రెస్లో బయల్దేరి ఊటీ వెళ్దాం" అన్నాడు అశ్వద్ధామ.

ఇన్స్పెక్టర్ ప్రతాప్ లేచాడు. అశ్వద్ధామ అతడి వంక సూటిగా చూశాడు.

"ప్రతాప్, గజదొంగ రామ్మూర్తి గురించి మీకు తెలిసినదంతా చెప్పండి!"

"అతడు పొడుగ్గా, బలంగా వుంటాడు. అతడు మారువేషాలు బాగా వేస్తూంటాడు. అందువల్లనే అతడిని పట్టుకోడానికి డిటెక్టివ్ వాలిగారు యెంతో కష్టపడ వలసి వచ్చింది" అన్నాడు ప్రతాప్.

"ఇదంతా ఉపయోగపడ్తుంది" అన్నాడు అశ్వద్ధామ.

"అశ్వద్ధామగారూ, ఏదేనా అవుసరమైతే STD కాల్ చేసి నాతో మాట్లాడండి. నేను వెళ్ళొస్తాను" అని ప్రతాప్ తన జీప్ వైపు నడిచాడు.

సురేఖ భుజంమీద చెయ్యివేసి ఆమె కళ్ళలోకి చూశాడు అశ్వద్ధామ.

"రేఖా, ఊటీ చేరుకోగానే మనిద్దరం విడిపోవాలి.

నేను ఇంపీరియల్ హోటలుకి వెళ్తాను. అదే హోటలుకి నువ్వు వేరే వచ్చి గది తీసుకో!"

"అలాగే" అందామె.

5

ఊటీలోని ఇంపీరియలు హోటలు ముందు హాల్లో కూర్చుని అశ్వద్ధామ నలువైపులా చూశాడు.

అతడికి ఎడంవైపున ఎవరో వ్యక్తి ఒంటరిగా కూర్చుని పుస్తకం చదువుతున్నాడు. అతడు పొడుగ్గా, లావుగా వున్నాడు. పిల్లిగడ్డం.

కుడివైపున దూరంగా మరో వ్యక్తి వున్నాడు. అతడి వయస్సు నలభై దాటివుంటుంది. నల్లటి కళ్ళద్దాలు ధరించాడు. అతడు విస్కీ సేవిస్తూ కాగితంమీద ఏదో రాస్తున్నాడు.

ఎదురుగా నలుగురు మగవాళ్ళు కూర్చుని పేకాడు కుంటున్నారు. నెగ్గిన వ్యక్తికి డబ్బుకి బదులు చిప్స్ ఇస్తున్నారు.

వారికి కొంచెం దూరంలో ఒక స్త్రీ ఒంటరిగా కూర్చుని స్వెటర్ అల్లుతోంది. ఆమె మెడలో వజ్రాల గొలుసు మెరుస్తోంది. ఆమె ధనవంతురాలై వుండాలి!

హోటలు మేనేజరు తన గదిలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు. ఒకే ఒక బట్లర్ హాల్లో కూర్చున్న వాళ్ళకు కావలసిన వాటిని ఆలశ్యంగా అందిస్తున్నాడు.

అశ్వద్ధామ కాఫీ తాగుతూ సిగరెట్ వెలిగించాడు. అతడు హోటలుకొచ్చి రెండుగంటలు దాటింది. తన చుట్టూవున్న వాళ్ళలో యెవరో నానాలాల్ని హత్య చేసి వుండాలి. అందర్నీ అతడు గమనిస్తున్నాడు.

మిస్ సురేఖ వేగంగా హాల్లోకొచ్చి ఒక సోఫాలో

కూర్చుంది. "బాయ్!" అని పిల్చింది. బట్లర్ హాల్లో లేక పోవటంవలన ఆమెకెవరూ జవాబివ్వలేదు.

అశ్వద్ధామ మేనేజర్ గదివైపు నడిచాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడు మేనేజర్.

"ఒక యువతి బాయ్‌ని పిలుస్తోంది. అతడు ఏమయ్యాడో!"

"డోంట్ బాదర్ సార్. నేను పంపిస్తాను" అని మేనేజర్ లేచాడు.

"మరికొందరు బేరర్స్‌ని పెట్టుకోకూడదూ?" అశ్వద్ధామ అడిగాడు.

"శ్రీకాకాలంలో దొరకరు సార్. నిన్న పొద్దుట ఒక బట్లర్‌ని పెట్టాను. వాడు చెప్పకుండా ఎక్కడికో పోయాడు. మరో బట్లర్ సాయంత్రం దొరికాడు. అతడే అన్ని పనులూ చూసుకుంటున్నాడు" అన్నాడు మేనేజర్.

అశ్వద్ధామ వెళ్ళి తన సోఫాలో కూర్చున్నాడు. మేనేజరు పంపిన బట్లర్ సురేఖ దగ్గరకు వెళ్ళటం అతడు గమనించాడు.

పిల్లిగడ్డం వ్యక్తి పుస్తకం చదవటంలో మునిగి వున్నాడు. అశ్వద్ధామ అతడివైపు చూశాడు. ఆలోచిస్తూ అశ్వద్ధామ లైటర్‌తో సిగరెట్ వెలిగిస్తూ, లైటర్ ప్రక్కన అమర్చిన బైనాక్యులర్స్ ద్వారా పిల్లిగడ్డం మనిషిని చూశాడు.

అతడు చదువుతున్న పుస్తకం పేరు చూసి అశ్వద్ధామ తృళ్ళిపడ్డాడు.

"దొరకని హంతకుడు!"

ఆ నవల పేరు చూడగానే అశ్వద్ధామ సోఫాలోంచి

లేచాడు. మెల్లిగా ముందుకు వెళ్ళాడు. పిల్లిగడ్డం వ్యక్తి ప్రక్కనుంచి తన గదివైపు నడిచాడు అశ్వద్ధామ.

మిస్ సురేఖ అతడివైపు అదోలా చూసింది.

6

అశ్వద్ధామ అప్పుడే లేచి తన వాచ్ వైపు చూశాడు. టైము నాలుగయింది.

బాత్ రూంలోకి వెళ్ళి మొహం కడుక్కొని అతడు సోఫాలో కూర్చున్నాడు.

గది తలుపు తోసి బట్లర్ ట్రే పట్టుకుని లోపలకు వచ్చాడు. ట్రేను టీపాయిమీద పెట్టి బట్లర్ అలాగే నిలబడిపోయాడు. అశ్వద్ధామ అతడివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

గది తలుపు తోసి బట్లర్ అశ్వద్ధామ కెదురుగా వచ్చాడు.

"క్షమించండి. మీ పేరు హోటలు బుక్కులో కృష్ణమూర్తి అని వుంది. అది మీ అసలు పేరేనా?" బట్లర్ అడిగాడు.

"నా అసలు పేరు కాదని నువ్వనుకుంటున్నావా?" అన్నాడు అశ్వద్ధామ కోపంగా.

"అవసరాన్ని బట్టి కొందరు పేర్లు మారుస్తూ వుంటారు. అందుకని అడుగుతున్నాను, సార్."

ఆలోచిస్తూ అశ్వద్ధామ బట్లర్ వంక చూశాడు. సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావు ఇతనేనేమో! బట్లర్ వెళ్ళిపోయాడు.

"ఆగు. నేను అశ్వద్ధామను. నువ్వెవ్వరు?"

బట్లర్ నవ్వుతూ వచ్చి అతడికి నమస్కరించాడు.

"మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం. నేను

సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావుని. మద్రాసులోని నానాలాల్ హంతకుని కోసం యిక్కడ దర్యాప్తు సాగిస్తున్నాను" అన్నాడతను.

"సంతోషం! ఇంతవరకూ ఏదేనా తెలిసిందా?" అడిగాడు అశ్వద్ధామ.

"ఈ హోటల్లో వున్న అందర్నీ ఓ కంటితో చూస్తున్నాను. హాల్లో కూర్చునే పిల్లిగడ్డం మనిషి ప్రవర్తన అదో విధంగా వుంది. అతడి మీద నాకు అనుమానంగా వుంది, సార్."

"అతడిని నేనూ చూశాను" అన్నాడు అశ్వద్ధామ.

"కాని మరో విషయం నన్ను పీక్కుతింటోంది. నిన్న సాయంత్రం నేనిక్కడ చేరేముందు, ఒక బట్లర్ వుండేవాడు. పొద్దుట ఉద్యోగంలో చేరినతను అంత హఠాత్తుగా ఎందుకు మాయమయ్యాడు? ఆ బట్లర్ గాభరాగా బస్సెక్కి కూనూరువైపు వెళ్ళాడని తెల్సుకున్నాను. మనకు కావలసినవాడు అతదేనేమో అని నాకు అనుమానంగా వుంది."

"కొత్తగా వచ్చిన ఒక యువతిని యివాళ ముందు హాల్లో చూశాను. ఆమె ఎవరు?" అడిగాడు అశ్వద్ధామ.

"ఆమె పొద్దుటే వచ్చింది సార్. బుక్‌లో ఆమె పేరు జానకని రాసివుంది. చాలా అందమైన యువతి. అందరూ ఆమెవైపే చూస్తున్నారు. ఈ చలికాలంలో ఆమె యిక్కడికెందుకొచ్చిందో! అదంతా యింకా నేను కనుక్కోవాలి. తెలిశాక మీకు రిపోర్టు చేస్తాను."

బట్లర్ వేషంలో వున్న మృత్యుంజయరావు గట్టివాడే. అతడు అందర్నీ గమనిస్తున్నాడు అనుకున్నాడు అశ్వద్ధామ.

"నే వెళ్తాను సార్. మీ సహాయంతో నేనొచ్చిన పని పూర్తవుతుందని నా నమ్మకం."

"పూర్తవుతుంది" అన్నాడు అశ్వద్ధామ.

బట్లర్ వెళ్ళిపోయాడు. అశ్వద్ధామ తినడం ప్రారంభించాడు.

7

చీకటిపడింది. తోటలో తిరిగి అశ్వద్ధామ హోటలు నడవమ్మట నడుస్తున్నాడు. నడువ లైట్లు యింకా వెలగటం లేదు.

ఏదో ఆకారం గదిలోంచి బయటకొచ్చి వేగంగా వెళ్ళిపోవటం అతను గమనించాడు. మరి కొంత దూరం వెళ్ళి ఆ గదిముందు ఆగాడు. తాళంచెవి పెట్టే చిల్లు లోంచి లోపలకు చూశాడు. లోపల లైటు వెల్గుతోంది.

ఈ పక్క గదులన్నీ తాళాలు వేసున్నాయి. గదుల్లో లైట్లు లేవు. ఈ గదిలో లైటు ఎందుకుంది? ఈ గది యెవరిది?

స్కెలిటన్ కీతో తాళం తెరిచి అశ్వద్ధామ లోపలకు వెళ్ళాడు. గదిలో లైటు డిమ్‌గా వెల్గుతోంది. గదిలో మంచం, పైన పరుపు వున్నాయి. అశ్వద్ధామ మంచాని కటువైపు వెళ్ళాడు. అతడి కళ్ళను అతడే నమ్మలేక పోయాడు.

నేలమీద ఒకతను వెల్లకిలా పడున్నాడు. కత్తితో గుండెల్లో పొడిచి అతడిని చంపారని అశ్వద్ధామ క్షణంలో గ్రహించాడు.

ఈ శవాన్ని చూస్తూంటే యింతకుముందు తను మద్రాసులో చూసిన నానాలాల్ శవం గుర్తొచ్చింది. నానాలాల్‌ని కూడా యిలాగే గుండెల్లో పొడిచి

చంపారు!

ఇదంతా చూస్తుంటే నానాలాల్ హంతకుడు యీ హోటల్లో యెక్కడో వున్నాడనిపిస్తోంది! అయితే యితడు ఎవరు? ఇతడిని ఎవరు చంపారు?

ఆలోచిస్తూ అశ్వద్ధామ గది నలువైపులా చూశాడు. ఒక పెట్టె, బాగ్ గోడవారగా వున్నాయి. తెరిచి చూద్దామని అతడు దగ్గరగా వెళ్ళాడు.

అదే క్షణంలో గదిలోని లైట్ ఆరిపోయింది. తడుముకుంటూ అశ్వద్ధామ నడవమీదకు వచ్చాడు. ఎక్కడా లైట్లు లేవు. కటిక చీకటి.

అశ్వద్ధామ కదలకుండా అలాగే వుండిపోయాడు. రెండు బలమైన చేతులు అతడిని చుట్టేశాయి. మరు క్షణంలో రుమాలు అతడి ముక్కుమీద అదిమిపెట్ట బడింది.

ఏమిటిదంతా? అశ్వద్ధామ ఆలోచించే స్థితిలో లేడు. తల తిరిగినట్లయింది. అతడు కుప్పలా కూలిపోయాడు.

8

ఏదో గోల విని అశ్వద్ధామ అప్పుడే మేలుకున్నాడు. కళ్ళు నులుపుకొని అతడు చూశాడు. గదిలో యిద్దరు పోలీసు సబిన్స్పెక్టర్లు వున్నారు. కానిస్టేబుల్సు పచార్లు చేస్తున్నారు. గది తలుపు బార్లా తెరిచివుంది.

ఇదంతా కలా? ఏమిటిదంతా? మిస్ సురేఖ, పక్క గదిలో వుండే వ్యక్తి గుమ్మంలో నిలబడి అతడివైపు చూస్తున్నారు!

"మనకి అట్టే టైములేదు. గదంతా సోదా చేయండి" అరిచాడు ఓ సబిన్స్పెక్టర్.

అశ్వద్ధామ ఆశ్చర్యపోయాడు. తన గదిని సోదా

చేయటమా? ఎందుకూ?

అశ్వద్ధామ లేచి ముందుకు కదిలాడు. సబిన్స్పెక్టర్ కళ్ళల్లోకి చూశాడు. అలా చూస్తుంటే ఏదో అతడికి జ్ఞప్తికొచ్చింది.

"ఎవరు మీరు? మీకేం కావాలి?" అర్చాడు అశ్వద్ధామ.

"నేను సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావుని. ఈయన ఊటీ సబిన్స్పెక్టర్ నాయక్. నీ నాటకం మాకు పూర్తిగా అర్థమైంది, నిన్ను అరెస్టు చేస్తున్నాం" అన్నాడతను.

అశ్వద్ధామ అలాగే నిలబడి, మౌనంగా సిగరెట్ వెలిగించాడు. సబిన్స్పెక్టర్లు యిద్దరూ గదిని సోదా చేస్తున్నారు.

హోటలు మేనేజరు కూడా వచ్చి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావు ఏర్ బాగ్ లోని వస్తువులను బయట పడేశాడు. చిన్న పెట్టెను చూసి అమాంతంగా "నాయక్!" అని అర్చాడు.

నాయక్ పరుగెత్తుకొచ్చాడు. తన చేతిలో వున్న పెట్టెను తెర్చాడు మృత్యుంజయరావు. యాభై వజ్రాలు మెరుస్తున్నాయి!

తెరిచి వున్న పెట్టెను సబిన్స్పెక్టరు సమీపంలో వున్న వాళ్ళకు చూపించాడు. ఆ వజ్రాలను చూసి అశ్వద్ధామ తనలో తాను నవ్వుకున్నాడు.

పెట్టెను మూసి, దాన్ని సబిన్స్పెక్టర్ నాయక్ చేతిలో పెట్టాడు మృత్యుంజయరావు.

"నాయక్ గారూ, మనకు దొంగ దొంగిలించిన వజ్రా

లతో సహా దొరికాడు. వీటికోసమే ఇతడు నానాలాల్ ని హత్య చేశాడు. దీనితో నేనీ వూరు వచ్చిన పని పూర్తయింది. మీరు నాకు చాలా సహాయపడ్డారు. అతడికి బేడీలు వెయ్యండి!"

ఇన్స్పెక్టర్ నాయక్ వెంటనే అశ్వద్ధామ చేతులకు బేడీలు వేశాడు. అది చూడలేక సురేఖ కళ్ళు మూసుకుంది. కాని అశ్వద్ధామ మౌనంగా వుండిపోయాడు.

"నాయక్ గారూ, మీరు వెంటనే మద్రాస్ కి STD కాల్ చేసి యీ వార్త యిన్స్పెక్టర్ ప్రతాప్ గారికి చెప్పండి. ఆయన చాలా సంతోషిస్తారు" అన్నాడు మృత్యుంజయరావు.

"ఆయనతో ఏం చెప్పాలి?"

"కృష్ణమూర్తి అనే పేరుతో హంతకుడు యీ హోటల్లో వున్నాడని, మీ సహాయంతో నేను అతడిని అరెస్టు చేశాననీ చెప్పండి."

సబిన్స్పెక్టర్ నాయక్ వేగంగా బయటకు నడిచాడు.

పదిహేను నిమిషాల్లో నాయక్ తిరిగి వచ్చాడు.

"ఇన్స్పెక్టర్ ప్రతాప్ గారితో అంతా చెప్పాను. వజ్రాలు కూడా దొరికాయన్నాను. ఆయన చాలా మెచ్చుకున్నారు. మీకు అన్నివిధాలా సహాయపడమన్నారు" అన్నాడు సబిన్స్పెక్టర్ నాయక్.

"ఎన్నేళ్ళుగానో పోలీసు డిపార్టుమెంటులో వున్నాను. కాని యీ కేసు చాలా తొందరగా తేలిపోయింది. మీకు నేనిచ్చిన వజ్రాలపెట్టెను సాయుధ పోలీసులతో సహా మద్రాస్ పోలీస్ వారికి పంపండి. ఈ హంతకుడిని నేను స్వయంగా, తిన్నగా మద్రాస్ తీసుకుపోతాను. నాకు ఒక జీప్ మీరిస్తే సౌకర్యంగా వుంటుంది"

అన్నాడు మృత్యుంజయరావు.

"హోటలు బయటనున్న మా జీప్‌లో మీరు అతడిని తీసుకుపోండి" అన్నాడు నాయక్.

ఇన్స్‌పెక్టర్ మృత్యుంజయరావు బయటకు నడిచాడు. కాన్‌స్టేబుల్సు అశ్వద్ధామను బయటకు తీసుకుపోతుండగా మిస్ సురేఖ అడ్డు పడాలనుకుంది. కాని అతడి సౌజ్ఞను గుర్తించి ఆమె వూరుకుంది.

అశ్వద్ధామ ముందు సీటులో కూర్చున్నాడు. సబ్ ఇన్స్‌పెక్టర్ మృత్యుంజయరావు స్టీరింగ్ వెనుక సర్దుకున్నాడు. అశ్వద్ధామ సమీపంలో వున్న సురేఖవైపు చూస్తూ ఏదో సందేశాన్ని పంపాడు.

జీప్ మెల్లిగా ముందుకు కదిలింది.

9

పోలీసు వాన్ వచ్చి ఆగింది. వజ్రాల పెట్టెను పట్టుకొని ఇన్స్‌పెక్టర్ నాయక్ వాన్‌వైపు నడుస్తున్నాడు.

మిస్ సురేఖ అతడిని ఆగమని హెచ్చరించింది. "నాయక్ గారూ, మిమ్మల్ని బుట్టలో వేసి చాలా తెలివిగా ఆ సబిన్స్‌పెక్టర్ మృత్యుంజయరావు మీ పోలీసు జీప్‌తో వెళ్ళిపోయాడు. ఆలస్యం చెయ్యకుండా యిప్పుడయినా నిజం తెల్సుకోండి" అందామె గంభీరంగా.

సబిన్స్‌పెక్టర్ ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు. అందమైన యువతి. ఆమెలో ఏదో ఠీవి వుంది.

"మీరు ఎవరు?" అడిగాడు నాయక్.

"నా పేరు సురేఖ. మీరు సంకెళ్ళువేసి జీప్‌లో పంపిన వ్యక్తి డిటెక్టివ్ అశ్వద్ధామగారు. నానాలాల్ హంతకుడిని పట్టుకోటం కోసం మేమిద్దరం యిక్కడకు

వచ్చాం. మీరు తెలివితక్కువగా, దొంగ సృష్టించిన రుజువులను నమ్మి అశ్వత్థామగార్కి బేడీలువేసి హంతకుడితో మా జీప్‌లో పంపేశారు!" అందామె.

సబిన్స్పెక్టర్ నాయక్ స్తంభించిపోయినట్లు వుండిపోయాడు.

"మీరు చెప్పింది నాకు బోధపడలేదు" అన్నాడు ఓ నిమిషం తర్వాత.

సురేఖ అందరివైపు చూసింది. ఆమె చూపు ఇన్స్పెక్టర్ నాయక్ మీద నిలిచింది.

"విడదీసి చెప్తాను, వినండి. సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావులా నటించినతను అసలు హంతకుడు. అతడు ఈ హోటల్లో బట్లర్‌గా పనిచేస్తున్నాడు. ఆ బట్లర్ పోలీసు దుస్తులు ధరించి, సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావు తనేనని మీతో చెప్పుకుని మీ సహాయంతో మీ జీప్‌లో పారిపోయాడు. అతడిని ఆపండి!"

హోటలు మేనేజరు యీ మాటలు వినగానే తటాలున నాయక్ దగ్గరకొచ్చాడు.

"సార్, ఈమె చెప్పింది నిజమే అనుకుంటాను. పొద్దుటనుంచీ మా దగ్గర పనిచేసే బట్లర్ పత్తాలేకుండా పోయాడు" అన్నాడు హోటలు మేనేజర్.

మిస్ సురేఖ కళ్ళు విజయవంతంగా మెరిశాయి. సబిన్స్పెక్టర్ నాయక్ ఆదోలా మిస్ సురేఖవైపు చూశాడు.

"మీరు చెప్పింది నిజమైతే యీ వజ్రాల పెట్టె అతడి గదిలో మాకెలా దొరికింది?" అడిగాడు నాయక్.

మిస్ సురేఖ నవ్వుతూ తన హేండ్‌బాగ్‌లోని ఒక పెట్టెను తీసి తెరిచింది. ఆ పెట్టెలో యాభై వజ్రాలు

ధగధగ మెరుస్తున్నాయి.

"ఈ వజ్రాలు మీకెలా వచ్చాయి?"

సబిన్స్పెక్టర్ నాయక్ అర్థంచేసుకోలేక వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు.

"ఇవి అసలు వజ్రాలు. మీ పెట్టెలోవి నకిలీవి. వజ్రాల వర్తకుడిని అడిగితే నిజం మీకే తెలుస్తుంది" అందామె.

ఓ నిమిషం ఆలోచించి నాయక్ వాన్‌లో ఎక్కి, స్టీరింగ్ వెనుక కూర్చున్నాడు.

"సమీపంలో ఒక వజ్రాల వర్తకుడు వున్నాడు. అతడికి చూపెట్టి అడుగుదాం. మీరూ మాతో రండి" అన్నాడు నాయక్.

మిస్ సురేఖ వెంటనే వాన్ ఎక్కి నాయక్ పక్కనే కూర్చుంది. కానిస్టేబుల్స్ హడావుడిగా వాన్ వెనుక భాగంలో ఎక్కారు.

ఫర్లాంగు దూరంలో వున్న సేట్ లల్లూమల్ షాపు ముందు వాన్ ఆగింది. సబిన్స్పెక్టర్ నాయక్ వాన్ లోంచి కిందకు దిగాడు.

"మీరూ వస్తారా?" అడిగాడతను.

"మీరు వెళ్ళి త్వరగా చూపించిరండి. మనం వేగంగా వెళ్ళకపోతే ఆ హంతకుడు పారిపోతాడు" అంది సురేఖ.

నాయక్ షాపులోకి వెళ్ళాడు. పది నిమిషాల్లో అతడు తిరిగొచ్చాడు. మిస్ సురేఖ డ్రయివర్ సీట్లో కూర్చుని వుంది.

అతడామెవైపు విచారంతో చూశాడు.

"నన్ను క్షమించండి. పెద్ద పొరపాటు జరిగింది. నా దగ్గరున్నవి నకిలీ వజ్రాలే. నిన్న రాత్రి వాటిని యీ షాపులోనే ఎవరో కొన్నారుట" అన్నాడతను.

సురేఖ నవ్వింది.

"జీవితంలో ఇలా పొరపాట్లు జరుగుతూనేవుంటాయి. వాటిని గురించి విచారించి లాభంలేదు. మన కర్తవ్యం మనం యిప్పుడు చెయ్యాలి. ఆ జీవ్ వెళ్ళి అప్పుడే అర గంట అయింది. ఆ జీవ్ యింకా ఘాట్ రోడ్డమ్మట వెళ్తూనే వుంటుంది. మనం వేగంగా వెళ్ళి ఆ జీవ్‌ని ఆపాలి! మీరు పక్కనే కూర్చోండి. నేను వాన్‌ని డ్రయివ్ చేస్తాను" అందామె.

వాన్ ముందు నుంచి వచ్చి సబిన్స్పెక్టర్ నాయక్ ఆమె పక్క సీటులో కూర్చున్నాడు. మిస్ సురేఖ వాన్ని విమానంలా పోనివ్వసాగింది.

సబిన్స్పెక్టర్ నాయక్ కళ్ళు భయంతో స్పీడా మీటర్‌ని చూశాయి.

"మీ డ్రైవింగ్ భయంకరంగా వుంది!"

"ఇంతలా వెళ్తేగాని వాళ్ళు మనకు చిక్కరు! కాస్సేపు కళ్ళు మూసుకోండి! యెంత వేగంగా వెళ్ళినా ప్రమాదం రాకుండా నేను చూస్తాను" అందామె.

మలుపుల్లో టైర్లు అరుస్తున్నాయి. వాన్‌లోని వాళ్ళందరు ప్రాణాలు బిగబట్టుకుని కూర్చున్నారు. సంకెళ్ళు వేసిన అశ్వద్ధామ రూపం ఆమె మెదడులో తిరుగుతోంది.

మిస్ సురేఖ వాన్ స్పీడును యింకా హెచ్చించింది.

10

ఊటీనుంచి మెట్టుపాలయం పోయే ఘాట్ రోడ్డు పాములా మెలికలు తిరిగింది. ఒక నిర్జన ప్రదేశంలో జీప్ ఆగింది.

మృత్యుంజయరావు కిందకు దిగాడు. అశ్వద్ధామవైపు క్రూరంగా చూసి పళ్ళు పటపట కొరికాడు.

"జీప్ ఆపావెందుకు?" అశ్వద్ధామ అడిగాడు.

అశ్వద్ధామ కోటు కాలర్‌ను అతడు లాగి పట్టుకున్నాడు.

"ఎవరితో చెలగాటం ఆడుతున్నావో తెలుసా?"

"తెలుసు. కాని నీతో నేనాడటం లేదు. నువ్వే నాతో ఆడుతున్నావు!"

"నోరు మూయ్!"

"ప్రస్తుతం నేను నీ చేతుల్లో వున్నాను. నువ్వు నన్ను ఏదైనా చేయొచ్చు!"

యమదూతలా అతడు అశ్వద్ధామకేసి చూశాడు.

"ఇంత దూరం నీ నోరు మూయడానికి తీసుకురాలేదు. మాట్లాడించడానికి తీసుకొచ్చాను."

అశ్వద్ధామ నవ్వాడు.

"నా గదిలోంచి నువ్వు పట్టుకెళ్ళిన ఆ వజ్రాల పెట్టెను ఎక్కడుంచావు?"

ఆశ్చర్యంతో అశ్వద్ధామ ఆలోచించసాగాడు. వజ్రాల పెట్టె తను పట్టుకెళ్ళాడా?

"మాట్లాడు!" పిడుగులా అరిచాడతను.

"నా గదిని సోదాచేస్తే ఆ పెట్టె నీకే దొరికిందిగా?"

"అదికాదు. ఆ పెట్టె నీ గదిలో నేనే పడేశాను.

నా గదిలోంచి నువ్వు పట్టుకెళ్ళిన పెట్టె గురించి నే నడుగుతున్నాను. అందులో నిజమైన వజ్రాలున్నాయి" అన్నాడతను.

"అదంతా నాకు తెలియదు."

మృత్యుంజయరావు తన జేబులోంచి పదునైన కత్తిని పైకి తీశాడు. జీప్ లోంచి అశ్వద్ధామను కిందకు లాగాడు. అతడిని రోడ్డుపక్కకు లాక్కెళ్ళాడు. రోడ్డు వారగా రాళ్ళు పేర్చబడి వున్నాయి. అటుపైన లోయ! రాళ్ళ మీదనుంచి పడితే మనిషి ముక్కలు చెక్కలవుతాడు.

"ఇప్పుడేనా నిజం చెప్తావా? లేకపోతే పక్కనున్న లోయలోకి నిన్ను తోసేస్తాను. చెప్పు! నిజం చెపితే నిన్ను వదిలేస్తాను!" అరిచాడతను.

క్షణకాలం అశ్వద్ధామ పక్కనున్న లోయలోకి చూశాడు. ప్రకృతి సౌందర్యం అతడి హృదయాన్ని ఆనందంతో నింపింది—

"జవాబియ్యి!"

"చావబోయే వారికి సంకెళ్ళు వేయకూడదని పెద్దలంటారు. ఈ సంకెళ్ళు తీసేసి నీ యిష్టమొచ్చినట్లు చేసుకో!"

"అయితే చెప్పవన్న మాట! ఆ వజ్రాలకోసం ప్రాణాన్ని వదులుకుంటావా?"

అశ్వద్ధామ గంభీరంగా నవ్వాడు. కోపంగా అతడిని రాయిమీదకు వాల్చి పట్టుకున్నాడు మృత్యుంజయరావు.

"ఒక్కతోపు తోస్తే మెలికలు తిరుగుతూ లోయలోకి పడిపోతావు!"

అశ్వద్ధామ మళ్ళీ నవ్వాడు.

కత్తి కొనను అశ్వద్ధామ గొంతుమీద పెట్టాడతను.

"ఆఖరిసారి అడుగుతున్నాను చెప్పు!"

"చెప్తాను" అన్నాడు అశ్వద్ధామ.

కత్తి వెనక్కి జరిగింది. అశ్వద్ధామ కొంచెం ముందుకు జరిగి నిలబడ్డాడు.

ఏదో కారు నడుస్తున్న ధ్వని వినపడింది—ధ్వని యింకా ఎక్కువైంది. మృత్యుంజయరావు వడివడిగా జీప్ దగ్గరకు పరుగెత్తాడు.

మృత్యుంజయరావు జీప్‌లో కూర్చుని వెనక్కి చూస్తున్నాడు. దగ్గరవుతున్న పోలీస్ వాన్ అతడికగుపించింది.

గాభరాగా అతడు జీప్‌ను పోనిచ్చాడు. అశ్వద్ధామ రోడ్డుమీదే నిలబడిపోయాడు. పోలీస్ వాన్ దగ్గర కొచ్చింది. డ్రయివరు సీటులో వున్న సురేఖను చూడగానే అతడి కళ్ళు ప్రకాశించాయి.

అశ్వద్ధామ పక్కనే సడన్ బ్రేకుతో వాన్ ఆగింది. ఇన్‌స్పెక్టర్ నాయక్ కిందకు దిగాడు.

"క్షమించండి, సార్" అన్నాడు నాయక్.

"అవన్నీ తర్వాత! అతడు పారిపోతున్నాడు! అతడిని పట్టుకోవాలి!" అన్నాడు అశ్వద్ధామ.

సబిన్‌స్పెక్టర్ నాయక్ అశ్వద్ధామ చేతులకున్న బేడీలను తీసేశాడు. వెనక్కి వెళ్ళి వాన్‌లో ఎక్కాడు. ముందు సీటులో కూర్చుని అశ్వద్ధామ తలుపు మూశాడు. ఆప్యాయంగా సురేఖవైపు చూశాడతను.

"రేఖా, గో ఫాస్టు! ఆ జీప్‌ని ఆపాలి!" అన్నాడతను.

వాన్ వేగంగా ముందుకు పోయింది.

వాన్ మలుపులు తిరిగి విమానంలా వెళ్తోంది. ముందు

వెళ్తూన్న జీప్ యిప్పుడు కనిపిస్తోంది. జీప్‌ను చూసి ఇన్స్‌పెక్టర్ నాయక్ వుద్రేకంతో గెంతుతున్నాడు.

మరో మలుపు తిరిగేలోపల వాన్ జీప్‌ను దాటి పోయి అమాంతంగా ఆగింది.

మృత్యుంజయరావు జీప్‌లోంచి బయటకు దూకి పారి పోబోయాడు. అశ్వద్ధామ అతడివైపు దూకాడు. రెండు నిమిషాల్లో అశ్వద్ధామ చేతుల్లో అతడు యిరుక్కు పోయాడు.

ఇన్స్‌పెక్టర్ నాయక్, కానిస్టేబుల్సు, సురేఖ అక్కడకు పరుగెత్తుకొచ్చారు.

"నాయక్ గారూ, యితడి చేతులకు బేడీలు వేయండి" అన్నాడు అశ్వద్ధామ.

"నన్నే మోసం చేస్తావా, రాస్కెల్!" అని అరుస్తూ సబిన్స్‌పెక్టర్ నాయక్ అతడి చేతులకు బేడీలు వేశాడు.

"ఇతడిని వాన్‌లో కూర్చోబెట్టండి" అన్నాడు నాయక్.

కానిస్టేబుల్సు అతడిని యీడ్చుకుపోయి వాన్‌లో ఎక్కించారు. ఇన్స్‌పెక్టర్ నాయక్ అశ్వద్ధామ వంక చూశాడు.

"మీరు జీప్‌లో రండి, సార్. నేను వాన్‌లో వెళ్తాను" అన్నాడతను.

వాన్ కదిలింది. సురేఖ జీప్‌ను పోనిచ్చింది. ఆమె పక్కనే కూర్చున్నాడు అశ్వద్ధామ.

జీపును పోనిస్తూ తను కనుక్కున్నదంతా ఆమె అతడికి చెప్పసాగింది. అతడు మౌనంగా వింటూ సిగరెట్ వెలి గించాడు.

ఫ్లోటలు ఇంపీరియల్ కాంపౌండులో వాన్, జీపు

ఆగాయి. సబిన్స్పెక్టర్ నాయక్ జీపు దగ్గరకు పరుగెత్తు కొచ్చాడు.

"నాయక్ గారూ, మన పని యింకా పూర్తికాలేదు. హోటల్లో కళ్యాణి అనే స్త్రీ స్వెట్టర్ అల్లుతూ వుంటుంది. ఆమెను అరస్టు చెయ్యండి. రూమ్ నెంబర్ 20లో సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావు శవం మంచం పక్కన పడుంటుంది."

ఇన్స్పెక్టర్ నాయక్ ఆశ్చర్యంతో అశ్వద్ధామవైపు చూశాడు.

"మరో విషయం. మద్రాస్‌లోని యిన్స్పెక్టర్ ప్రతాపుకు ఫోన్ చేసి, అతడిని వెంటనే ఇక్కడకు నేను రమ్మన్నానని చెప్పండి" అన్నాడు అశ్వద్ధామ.

"అలాగే సార్" అన్నాడు నాయక్.

అశ్వద్ధామ, మిస్ సురేఖ హోటలు ముందు హాల్లోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నారు.

"విస్కీ అండ్ సోడా!" అన్నాడు అశ్వద్ధామ నీరసంగా.

11

మర్నాడు ప్రొద్దుట మిస్ సురేఖ గది ఆ నేకమందిలో క్రిక్కిరిసివుంది. అశ్వద్ధామ, ఇన్స్పెక్టర్ ప్రతాపు, సబిన్స్పెక్టర్ నాయక్, మిస్ సురేఖ, హోటలు మేనేజరు సోఫాల్లో కూర్చున్నారు. కానిస్టేబుళ్ళు గదిలో నిలబడివున్నారు.

"కళ్యాణిని అరస్టుచేశాం. ఆమె వజ్రాల వ్యాపారం చేస్తోంది. ఆమె ఢిల్లీనుంచి యిక్కడకు వచ్చింది. ఢిల్లీ పోలీసులు నిన్న రాత్రి ఆమె షాపును సోదాచేశారు. గజదొంగ రామ్మూర్తి యింతకుముందు దొంగిలించిన

వస్తువులెన్నో ఆమె షాపులో దొరికాయని నాకు వార్త అందింది" అన్నాడు యిన్స్పెక్టర్ ప్రతాప్.

"ఆమెకు మృత్యుంజయరావు హత్యతో సంబంధం లేదు. దొంగిలించిన వస్తువులను కొనటమే ఆమె చేసిన ముఖ్య నేరం" అన్నాడు అశ్వద్ధామ.

"అశ్వద్ధామగారూ, మొదటినుంచీ జరిగినదంతా మీరు చెప్తే అందరం సంతోషంగా వింటాం" అన్నాడు సబిన్స్పెక్టర్ నాయక్.

డిటెక్టివ్ అశ్వద్ధామ నవ్వుతూ నలువైపులా చూసి యిలా చెప్పసాగాడు. "మద్రాస్‌లో నానాలాల్ హత్య జరిగింది. లక్షలు విలువైన వజ్రాలను జేబులో పెట్టుకుని యింటికి వెళ్తూండగా అతడు చంపబడ్డాడు. అతడి దగ్గర వజ్రాలు వున్నాయన్న విషయం భార్యకీ, సేట్ మోతీలాల్‌కీ మాత్రం తెలుసు. సేట్ మోతీలాల్ మీదే మన అనుమానం వుంటుంది.

"త్వరలో నా అనుమానం బలపడింది. బొంబాయిలో కోటీశ్వరుడైన సేట్ మోతీలాల్ అసలు మద్రాసు రాలేదు. అయితే యెవరో ఆ పేరుతో వ్యవహారిస్తూ వుండాలి! 'గజదొంగ' రామ్మూర్తి మద్రాసులో ఎక్కడో వుండొచ్చని వార్తలు అప్పుడే వచ్చాయి. 'గజదొంగ' రామ్మూర్తి మారువేషాలు వేయటంలో అఖండుడు. అతడే సేట్ మోతీలాల్ పేరుతో కన్నె మేరాలో గది తీసుకుని వుండొచ్చని నేను అనుమానించాను.

"నానాలాల్ హత్య చేయబడిన రాత్రే సేట్ మోతీలాల్ విమానాశ్రయానికి వెళ్ళాడు. అదే రాత్రి అతడు నాఖరు ఊటీకి ట్రెయిన్‌లో వెళ్ళాడు. నిజం చెప్పాలంటే మోతీలాల్, అతడి నాఖరు వేరువేరు మనుషులు

కారు. ఒకే మనిషి వారిద్దరిలా నటిస్తున్నాడు! ఇదంతా చెయ్యగలిగింది గజదొంగ రామ్మూర్తే! అందుకనే నేనూ, సురేఖ ఊటీ వచ్చాం.

"మా కంటే ముందు సబిన్స్పెక్టర్ మృత్యుంజయ రావు యిక్కడకు చేరుకుని యీ హోటల్లో బట్లర్ గా చేరాడు. ఆ బట్లర్ సాయంత్రానికి మాయమయ్యాడు. మరో బట్లర్ ప్రత్యక్షమయ్యాడు. ఈ బట్లర్ మరెవ్వరో కాదు—గజదొంగ రామ్మూర్తే!" మృత్యుంజయరావు పోలీసు ఉద్యోగని తెలుసుకుని అతడిని చంపేశాడు రామ్మూర్తి. తర్వాత యిక్కడ బట్లర్ గా చేరాడు!"

అశ్వద్ధామ ఆగాడు.

"బ్రహ్మాండంగా వుంది సార్" అన్నాడు హోటలు మేనేజర్.

"ఒక సాయంత్రం బట్లర్ నా గదికొచ్చాడు. తనే సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావని నాతో చెప్పాడు. నేను నమ్మాను. మృత్యుంజయరావును యిక్కడకు పంపుతున్నట్లు ఇన్స్పెక్టర్ ప్రతాప్ నాతో చెప్పారు. అతడు మారువేషంలో వుంటాడన్నాడు. ఆ పరిస్థితుల్లో నేను నమ్మక తప్పలేదు!" అన్నాడు అశ్వద్ధామ.

ఇప్పుడు మిస్ సురేఖ చెప్పసాగింది.

"చీకటి పడింది. నడవమ్మట నడుస్తున్నాను. బట్లర్, స్వెటర్ తొడుతూ కనిపించే కళ్యాణి ఒక గదిలోంచి బయటకొచ్చి అటు వెళ్ళిపోయారు. ఆ గదివైపు మెల్లిగా నడిచాను. వాళ్ళు లోపల ఏం చేస్తున్నారు. ఆ గది ఎవరిది? స్కెలిటన్ కీతో తెరిచి లోపలకు వెళ్ళాను. ఒక పెట్టె కనిపించింది. తెర్చి చూశాను. బట్టలకింద ఒక అట్టపెట్టె వుంది. తెర్చి చూశాను. యాభై వజ్రాలు

ధగధగ మెరుస్తున్నాయి!

బూట్ల చప్పుడు వినపడింది. బయటకు పరుగెత్తాను. తలుపు మూసి వెళ్ళిపోయాను. వజ్రాల పెట్టె నా బాగ్‌లో వుంది" అంది సురేఖ.

"ఆ బూట్ల చప్పుడు నాదే! ఆ గది ముందునుంచి ఎవరో వెళ్ళటం చూసి అదే గదిలోకి నేను వెళ్ళాను. మంచంపక్క పడున్న శవాన్ని చూశాను. అమాంతంగా లైట్లు ఆరిపోయాయి. నడవలోకి వెళ్ళాను. బలమైన చేతులు నన్ను చుట్టేశాయి. ఎవరో క్లోరోఫాం వాసన చూపించారు. నేను కింద కూలిపోయాను.

మర్నాడు పొద్దుటే లేచేసరికి నా గదినిండా పోలీసు లున్నారు!" అన్నాడు అశ్వద్ధామ.

మిస్ సురేఖ అశ్వద్ధామ వైపు చూసింది.

"సబిన్స్పెక్టర్ మృత్యుంజయరావుగా నటిస్తున్న అతడితో మీరు ఒంటరిగా జీపులో వెళ్ళటం నాకు నచ్చలేదు" అంది సురేఖ.

"అవును, సార్. మీరు మౌనంగా వుండిపోయారు. నాతో నిజం చెప్పివుంటే మిమ్మల్ని పంపేవాడిని కాను. అతడు మిమ్మల్ని చంపుతాడేమో అని తర్వాత నేను చాలా భయపడ్డాను" అన్నాడు సబిన్స్పెక్టర్ నాయక్.

అశ్వద్ధామ గంభీరంగా నవ్వాడు.

"క్రితం రాత్రి క్లోరోఫామ్ వాసన చూపించి అతడు నన్ను మోసుకెళ్ళి నా గదిలో పడేసి తలుపుకు తాళంవేశాడు. నానాలాల్‌నీ, మృత్యుంజయరావునీ ఒక పోటుతో చంపినవాడు నడవలో చీకట్లో నన్నెందుకు చంపకుండా వదిలేశాడు? నాతో అతడికేదో పని వుండుండాలి! తన పని అయిందాకా అతడు నన్ను

చంపడు! ఆ పని ఏమిటో వెళ్ళి తెల్సుకుందామని అతడితో మౌనంగా వెళ్ళాను. నా వెనుక రమ్మని రేఖకు సౌజ్ఞ చేశాను" అన్నాడు అశ్వద్ధామ.

"అశ్వద్ధామగారూ మీరు చెప్పింది చాలా లాజికల్‌గా వుంది సార్! అసలు వజ్రాలపెట్టెను మీ రెక్కడో దాచారని అతడి నమ్మకం" అన్నాడు ఇన్స్పెక్టర్ ప్రతాపు.

"ఆ పెట్టె మిస్ సురేఖ బాగ్‌లో వుందని అతడికి తెలియదు" అన్నాడు నాయక్.

"అది అప్పట్లో నాకూ తెలియదు" అన్నాడు అశ్వద్ధామ నవ్వుతూ.

"గజదొంగ రామ్మూర్తినీ, పోయిన వజ్రాలనూ మాకు అప్పగించినందుకు మీ యిద్దర్కీ మా ధన్యవాదాలు" అన్నాడు యిన్స్పెక్టర్ ప్రతాప్, తన చూపును అశ్వద్ధామ సురేఖలవైపు పోనిస్తూ.

—:ఐపోయింది:—